
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 26 మార్చి 2025

సమయ పాలన సరే..
సేవలు అధ్వానం..



ఎల్లారెడ్డిపేటలో పరీక్షలకు నిరీక్షిస్తున్న రోగులు

- కలెక్టర్, వైద్యాధికారుల తనిఖీలతో గాడిన పడుతున్న సిబ్బంది
- తాజాగా వైద్యులు, సిబ్బందికి ఆధార్ అటెండెన్స్
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత
- జిల్లాలో రోగులకు పూర్తిస్థాయిలో అందని వైద్య సేవలు
- జిల్లాలో 13 ఆరోగ్య కేంద్రాలు, రెండు అర్బన్, రెండు బస్తీ దవాఖానాలు
- 89 ఆరోగ్య ఉప కేంద్రాలు..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల/నెట్‌వర్క్)

గ్రామీణ పేదలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మెరుగైనవైద్యసేవలు ఇంకా అందడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 89 ఉపకేంద్రాలు, రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు బస్తీ దవాఖానాల ద్వారా వైద్యసేవలు అందించే ఏర్పాట్లు ఉన్నాయి. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సిబ్బంది కొరత ఇబ్బంది కరంగా మారింది. ఉదయంనుంచి సాయంత్రం వరకు వైద్యసేవలు కొంతమేరకు అందుతున్నా సాయంత్రం తరువాత నర్సింగ్ సిబ్బంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం అందని పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సిందే. మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వారి వైద్యం వికటించి కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజితలు నిత్యం తనిఖీలు చేపడుతుండడంతో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నారు. సేవలు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. మండల కేంద్రాల్లో వైద్యులు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి నిత్యం వస్తుండడం కూడా పూర్తిస్థాయిలో సేవలు అందని పరిస్థితి ఉంది. వైద్యులు, సిబ్బందికి ఆధార్ అటెండెన్స్ పద్ధతిని తీసుకవస్తున్నారు. ఇప్పటికే మొబైల్ యాప్ ద్వారా అటెండెన్స్ ప్రక్రియ ఉండగా, తాజాగా ఫేస్ రికగ్నిషన్‌ను తీసుకవచ్చే పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆంధ్రజ్యోతి విజిట్'లో పలు అంశాలు తేటతెల్లమయ్యాయి.

రక్త పరీక్షలకు ఇబ్బందులే..

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తనమూనా పరీక్షలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. పరీక్షలుచేసే యంత్రాల్లో సాంకేతిక లోపం తలెత్తడంతో మరమ్మతులకు నోచుకోకపోవడంతో కేవలం కొని పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. రెండునెలల క్రితం మందుల కొరత ఉండేదని ప్రస్తుతం పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. నిత్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాదాపు 50మంది రోగులు వస్తుండగా సోమవారం 39మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే 'ఆరోగ్య మహిళ'లో 80 మందికి పైగా రోగులకు..

మిగతా 8లో

అరకొర వసతులు.. అంతంత మాత్రంగా వైద్యసేవలు

ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర వసతులు ఉన్నాయి. వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇల్లంతకుంటలో 50పడకల ఆసుపత్రి మంజూరు కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెద్దలింగాపూర్ గ్రామానికి తరలిపోయింది. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పల్లె దవాఖానాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. ఇరుకైన భవనంలో ఆసుపత్రికి వచ్చిన వారు కూర్చునే వీలుకూడా లేదు. మహిళా ఉద్యోగులే ఎక్కువ మంది ఉన్నా వాష్‌రూంలకు నీరు రావడం లేదు. గతంలో 90మంది ఓపీ వస్తుండగా ప్రస్తుతం సగానికి పడిపోయింది. అన్ని విధాలైన మందులు అందుబాటులో ఉన్నాయి. పల్లె దవాఖానాలోనే ఆయుష్ వైద్యసేవలు ఉండగా వారికి ఒక గదిని మాత్రమే కేటాయించారు. వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టు మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా సిబ్బంది పెద్దలింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారని సిబ్బంది తెలిపారు.

- వేములవాడ ఆసుపత్రిలో సిబ్బంది కొరత

వేములవాడటౌన్ : వేములవాడ ఏరియా ఆసుపత్రికి నిత్యం 500మంది రోగులకు పైగా వస్తున్నారు. వందపడకల ఆసుపత్రిగా మారినప్పటికి సిబ్బందిని మాత్రం పెంచలేదు. గత ఫిబ్రవరిలోని 28రోజుల్లో 8 వేలమంది రోగులు ఆయా సమస్యలతో ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది సరిపడా లేరు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారని రోగులు తెలిపారు. వేములవాడ ఏరియా ఆసుపత్రికి వస్తున్న రోగుల దృష్ట్యా 50 మంది సిస్టర్స్ అవసరం కాగా, 18మంది ఉన్నారు. 25 మంది డాక్టర్‌లు అందుబాటులో ఉండాల్సి ఉండగా, 12మంది డాక్టర్‌లు మాత్రమే ఉన్నారు. వీరిలో4 రెగ్యులర్ డాక్టర్‌లు, ఇద్దరు కాంట్రాక్ట్, ముగ్గురు సివిల్ సర్జన్‌లు, ముగ్గురు డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఆసుపత్రిలో రాత్రి సమయంలో సెల్‌ఫోన్‌ల చోరీలు జరుగుతున్నాయని, ఒక ఔట్‌పోస్ట్ పోలీస్ ఉద్యోగిని నియమించాలని రోగులు కోరుతున్నారు. కాగా, నెలలు నిండక ముందు పుట్టిన చిన్నారులకు అవసరమైన సామగ్రి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీటీస్కాన్ మూడు సంవత్సరాలుగా నిరుపయోగంగా మారింది. దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ విషయంపై ఆసుపత్రి సూపరిండెంట్‌ను వివరణకోరగా సిటీస్కాన్ నిరుపయోగంగా ఉందని, ప్రతిసంవత్సరం సీటీస్కాన్ మెయింటనెన్స్‌కోసం రూ. 25లక్షలు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం అంత ఖర్చును భరించడానికి సిద్ధంగా లేదని, దీంతో నిరుపయోగం గా మారిందని తెలిపారు.



వేములవాడ గైనకాలజిస్టు వద్ద చూపించేందుకు వచ్చిన గర్భిణీ స్త్రీలు



వీర్నపల్లిలో ఇరుకు గదిలో వైద్యం



ముస్తాబాద్‌లో వినియోగంలోకి రాని జనరేటర్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

- జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ హన్మంతు



సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతు

సిరిసిల్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ హన్మంతు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పీఎం ఈజీపీ, పీఎం ఐఎస్, పీఎం ఎఫ్ఎంఈ, టీఈఈటీ, విశ్వకర్మ యోజన అంశాలపై సదస్సు జరిగింది. పాలిటెక్నిక్ ఐటీఐ, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, డీఆర్‌డీవో శేషాద్రి, పరిశ్రమల ఏడీ భారతి, జిల్లాసంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న పాల్గొన్నారు.

ముంపు గ్రామాల నిర్వాసితులు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిడ్‌మానేర్, అనంతగిరి ప్రాజెక్టలలో ముంపునకు గురైన గ్రామాల ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఏప్రిల్ 11లోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో కోరారు. మిడ్‌మానేరు, అనంతగిరి రిజర్వాయర్‌లకు సంబంధించి ముంపు గ్రామాలకు చెందిన ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మార్చి 25నుంచి ఏప్రిల్ 11వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, ఆసక్తి అర్హతగల ముంపు గ్రామాల ప్రజలు మీ సేవ, జిల్లా వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టీబీ రహిత జిల్లాగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

ముస్తాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను టీబీ రహితంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రోగామ్ జిల్లా అధికారి దండబోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాలైన గూడెం, ఆవునూర్, నామాపూర్, ముస్తాబాద్, పోతుగల్, చీకోడ్ సబ్ సెంటర్లలో టీబీనివారణపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి, ఎంపీహెచ్ఈవో యాదగిరి, టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ వరలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్‌లు, స్కావెంజర్లకు నేరుగా వేతనాలు అందించాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్కావెంజర్లు, స్వీపర్‌లు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, స్కావేంజర్లకు వేతనాలను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే వారి ఖాతాల్లో జమచేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్, స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో మంగళవారం ధర్నా చేసి కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మణ్, కో-కన్వీనర్ బోడ్డు నర్సవ్వ, ఎల్లయ్య, సుగుణ, రాములు, లక్ష్మీ, శోభ, శ్యామల తదితరులుపాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల శాంతినగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించడంతో పాటు మండెపల్లి కేసీఆర్‌నగర్‌లో చేపట్టిన సర్వే వివరాలను అధికారులు వెల్లడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతినగర్‌లో నిర్మించిన 204 డబుల్ బెడ్‌రూంలు పూర్తయి రెండుసంవత్సరాలు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడంతో పాడైపోతున్నాయని, అర్హులకు అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోడం రమణ, జిల్లా కమిటి సభ్యులు సూరం పద్మ పాల్గొన్నారు.

సన్మార్గంలో పయనించాలి

చందుర్తి,మార్చి 25: ప్రాంతంలో యువత సన్మార్గంలో పయనించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో పోలీసులు-మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగి, అభ్యున్నతి సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు, గంజాయి,మద్యం, జూదం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సంఘవిద్రోహశక్తుల ప్రలోభాలకు లొంగకూడదని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు, ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా పోలీస్ శాఖ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అంజయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల హిస్టరీపై దృష్టి పెట్టాలి

- ఎస్పీ మహేష్ బి గీతే



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మహేష్ బి గీతే

కోనరావుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్‌నేరాలు, అక్రమ గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌పై దృష్టి పెట్టడమే కాకుండా రౌడీ షీటర్ల హిస్టరీపై నిఘా పెట్టాలని ఎస్పీ మహేష్ బి గీతె అన్నారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు ఈసందర్భంగా స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరాతీసి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కి తక్షణమే స్పందిస్తూ సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను, హిస్టరీ షీటర్స్‌లను అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచుతూ తనిఖీ చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలకు, యువతకు సైబర్ నేరాలపై, అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఈసీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, ట్రైనీ ఎస్ఐ రాహుల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

వేములవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తప్పనిసరిగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వెంకటరమణ సూచించారు. వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు ఆదా చేయడం అలవాటు చేసుకోవాలని, అవసరాలు, కోరికలు, వాటికి ఎలా ప్రాధాన్యత ఇవ్వాలో వివరించారు. వేములవాడ అర్బన్ ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బన్నాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

తంగళ్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మందుల పంపిణీ నిల్వలపై ఆరాతీశారు. డాక్టర్ ఆఫీజా తదితరులు ఉన్నారు.

రుద్రంగి చిత్రకారుడిని అభినందించిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సొంతూరు మీద మమకారంతో తన స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామ వీధుల సౌందర్యాన్ని, గృహసముదాయాలు, చెట్టుచేమలు, పుట్టలు, చెరువుగట్లు వంటి ప్రకృతి సోయగాలను కాన్వాస్‌పై అత్యద్భుతంగా చిత్రించాడు శ్రీనివాస్ మంచా. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ పూర్తిచేసిన శ్రీనివాస్ కుంచె నుంచి జాలువారిన చిత్రాలతో మాదాపూర్ స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో 'ప్రవాహం'పేరుతో ప్రత్యేక ప్రదర్శన జరిగింది. ప్రదర్శనను తెలంగాణ శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న సందర్శించి శ్రీనివాస్‌ను అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- హన్మాజిపేట పీహెచ్‌సీ తనిఖీ

వేములవాడ రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. హన్మాజిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్ల వివరాల గురించి ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పశువైద్యశాలలో ఉన్న వ్యాక్సిన్ల వివరాలను తెలుసుకున్నారు.



పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మధ్యాహ్న భోజనం తయారీ పరిశీలన

హన్మాజిపేటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను, లింగంపల్లి, హన్మాజిపేట అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ విధానం, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆయన పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంత మంది పిల్లలున్నారు. కేంద్రాల పరిధిలో ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారో వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్‌లను పరిశలించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ..



వేములవాడ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చంపాపేట్ ప్రాంతంలో న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ సిరిసిల్ల కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

- వేములవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నేరెళ్ల తిరుమల గౌడ్, కే.విద్యాసాగర్‌రావు, రేగుల దేవేందర్, పొత్తూరు అనిల్ కుమార్, పిట్టల మనోహర్, పెంట రాజు, కే.పురుషోత్తం, గోపికృష్ణ, ప్రతాప సంతోష్, గడ్డం సత్యనారాయణరెడ్డి, గోగికారి శ్రీనివాస్, గొంటి శంకర్, కటకం జనార్ధన్, రేగుల రాజకుమార్, గుజ్జే మనోహర్, పంపరి శంకరయ్య, అనిల్, వడ్లకొండ శ్రీకాంత్, కనికరపు శ్రీనివాస్, హరీష్, నాగేంద్రబాబు పొత్తూరి మల్లేష్, జెనార్ధన్, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

బొంగుల కింది తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటుచేయాలి

కలెక్టరేట్‌కు తరలివచ్చిన గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బొంగుల కింది తండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ మంగళవారం గ్రామస్థులు కలెక్టరేట్‌కు తరలివచారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, గుండారం గ్రామాల మధ్య ఉన్న బొంగుల కింద తండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్‌కు తిమ్మాపూర్, గుండారం గ్రామపంచాయతీల నుంచి తీర్మానాలను అందించామని గ్రామస్థు లు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం బొంగుల కింద తండాకు నాలుగున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజ్యానాయక్ తండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు పంపించి ఆ తండా పేరును జైసేవాలాల్ తండా మార్చు చేసి గ్రామపంచాయతీగా ప్రకటించారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బొంగుల కింద తండాను గ్రామపంచాయతీగా మార్చాలంటూ కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు తరలివచ్చిన బొంగుల కింద తండావాసులు

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు. కొమురయ్య అనే వ్యక్తి లబ్ధిదారుల వద్ద నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అతని వద్ద నుంచి క్వింటాల్‌న్నర బియ్యాన్ని స్వాధీనం చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ మోటార్ అపహరణ

చందుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఎర్రవెల్లి రాజు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో నుంచి మోటర్, పైపులను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించారు. గ్రామస్థుల కథనం ప్రకారం రోజు మాదిరిగానే రాజు ఉదయం పొలం వద్దకు వెళ్లేసరికి బావిలోని మోటర్, పైపులు కనిపించలేదు. మోటార్ విలువ దాదాపు రూ. 40 వేల పైగా ఉంటుందని తెలిపారు.

కాపర్ వైర్ల చోరీ

గంగాధర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని చర్లపల్లి(ఆర్)లో వ్యవసాయ విద్యుత్ మోటర్ల కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని వరద కాలువకు సుమారుగా రెండు కిలోమీటర్ల మేర వ్యవసాయ మోటర్లతో రైతులు పొలాలకు సాగునీరందిస్తుంటారు. అయితే రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటర్లకు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ కాపర్‌వైర్లను దొంగిలిస్తున్నారని రైతులు వాపోయారు. పోలీసులు స్పందించి తమ మోటర్ల వైర్లను దొంగిలించిన వారిని గుర్తించి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయడం లేదు'

కరీంనగర్ క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని విజయ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తన పేరిట ఉన్న గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయకుండా ఇతరులకు అమ్ముకుంటున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భగత్‌నగర్‌కు చెందిన వొడ్నాల వెంకటశ్రీనివాసరావు మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పేరిట ఉన్న గ్యాస్‌సిలిండర్ ఖాతా నంబరుతో ప్రతి నెలా ఓ యాప్ ద్వారా సిలిండర్‌ను బుక్ చేసుకుంటూ బ్లాక్‌లో అమ్మకుంటున్నారని బాధితుడు ఆరోపించారు. దీనిపై పోలీసులకు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన పేరిట గ్యాస్‌సిలిండర్ బుక్ చేసి బ్లాక్‌లో అమ్ముకుంటున్న గ్యాస్ ఏజెన్సీ డీలర్‌షిప్‌ను రద్దుచేసి, తనకు పరిహారం ఇప్పించాలని కోరారు. వీనిపై వినియోగదారుల ఫోరంనకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నడకతో సమూహమై... సమాజ హితమై

● అభాగ్యులకు అండగా ఖని వాకర్స్ ● రూ. పదిలక్షలకు పైగా బాధితులకు అందజేత

కోల్‌సిటీటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం మొదలైన నడక అందరి సహకారంతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేలా చేసింది. ఐదారు గురుతో మొదలైన ఈ నడక రోజురోజుకు సభ్యుల సంఖ్య పెరుగుతూ వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. వాట్సాప్‌లో సమాచారాన్ని అందిస్తూ ఎంతో కొంత డబ్బు జమ చేసి ఆపదలో ఉన్న వారికి అందజేస్తున్నారు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.

గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వాకింగ్ కోసం వచ్చిన వారు స్నేహితులై సమాజ హితం కోసం 2019 సంవత్సరంలో ఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఏర్పడింది. అలా మొదలైన ఈ వాకర్స్ అసోసి యేషన్ సేవలు నేటికి కొనసాగుతున్నాయి. మిత్రులకు, అభాగ్యులకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలుస్తోంది. గోదావరిఖని ప్రాంతంలోని అన్ని వర్గాలకు చెందిన సుమారు 250 మందికి పైగా ఈ అసోసియేషన్‌లో ఉన్నారు. రోజు వాకింగ్ కోసం మైదానానికి వచ్చే వారిలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, పోలీసులు, సింగరేణి కార్మికులు, క్రీడాకారులు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాసరి రఘు అసోసియేషన్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సమష్టిగా ముందుకు వెళుతున్నారు. ఆపదలో ఉన్న విషయం తెలియగానే వెంటనే వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేసి సభ్యులకు సమాచారం ఇస్తున్నాడు. దీంతో సభ్యులందరూ స్పందించి తోచిన సాయాన్ని జమ చేసి బాధితులకు అందజేస్తున్నారు. ఇలా ఐదారేళ్ళుగా సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. స్టేడియం బాయ్ ఇంతియాజ్ కూతురు వివాహానికి రూ.లక్ష, నిరుపేద కూలి బాపు కుటుంబానికి రూ.1.30వేలు, భరత్ కుటుంబానికి రూ. 1,83 వేలు, నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం అందించారు. ఇలా ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు సాయం చేశారు.



స్టేడియం బాయ్ కూతురు వివాహానికి ఆర్థికసాయం అందిస్తున్న వాకర్స్ (ఫైల్)

సేవ చేయడంలో తృప్తి...



ఆరోగ్యం కోసం మొదలైన నడక ఇలా సేవకు మార్గం వేసింది. ఇందుకు అందరి సహకారం తోడైంది. మానవతా దృక్పథంతో ముందుకు వస్తూ తోచిన సహాయం అందిస్తున్నారు. వాటిని జమ చేసి అందరి సమక్షంలో ఇస్తున్నాం. ఇలా సేవ చేయడం చాలా తృప్తిగా ఉంది.

దాసరి రఘు, వాకర్స్ అసోసియేన్ కన్వీనర్

ఆరోగ్యం కోసం వెళితే ఆప్తులు...



ఆరోగ్యం కోసం మైదానం కోసం వెళితే ఆప్తులు దొరికారు. సేవా దృక్పథం కలిగిన స్నేహితులతో కలిసి తాను కూడా భాగస్వామినై తోచిన సాయం అందించడంలో తృప్తి ఉంది. రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేయడంలో ముందుంటాను.

చెన్నూరి వేణు, వ్యాపారి

సాయం చేయడంలో తృప్తి



ఆరోగ్యం కోసం పాతికేళ్ళుగా వాకింగ్ చేస్తున్నాను. చాలా మంది మిత్రులను మైదానం కలిపింది. అలా మైదానంలోని స్నేహితులందరం సమాజ హితం కోసం సేవ కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో నేను భాగస్వామిని కావడం తృప్తిగా ఉంది.

దీటి శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో చోరీ

జ్యోతినగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి నగదు, బంగారు, వెండి నగలు అపహరించారు. ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి పర్మినెంట్ టౌన్‌షిప్ లోని సీ-8/3 క్వార్టర్‌లో టీవీఆర్ చంద్ర, మరో ఇద్దరు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15వ తేదీన చంద్ర బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. అలాగే పక్కనే ఉన్న మరొక ఉద్యోగి ఇంట్లో అర కిలో వెండి నగలను అపహరించారు. మరొకరి ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఎలాంటి సొత్తు అపహరణకు గురి కాలేదు. దీంతో ఎన్‌టీపీసీ పోలీసులకు బాధితుడు చంద్ర సమాచారం అందించాడు. చంద్ర ఇంట్లో సుమారు రూ.15వేల రూపాయల విలువైన నగదు బంగారం, శ్రీనివాసరావు అనే ఉద్యోగి ఇంట్లో అరకిలో వెండి నగలు చోరీకి గురయ్యాయి.

పెద్దపల్లిలోని బంగారం షాపులో..

పెద్దపల్లి టౌన్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి పైడ బజారులోని దేవరకొండ కరుణాకర్‌కు చెందిన బంగారు షాపులో చోరీ జరిగింది. 10 తులాల బంగారం, నాలుగు వేల రూపాయల నగదు దోచుకెళ్లారు. కరుణాకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై మల్లేష్ కేసు నమోదు చేసుకున్నారు. సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించగా మహిళగా గుర్తించి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ధర్మారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నర్సింగాపూర్, ఖిలావనపర్తి, ధర్మారం గ్రామాల్లోని వందల ఎకరాల ప్రభుత్వ అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితం నర్సింగాపూర్ సర్వే నంబర్ 273లో జరుగుతున్న భూ ఆక్రమాలను తహసీల్దార్ ఎండీ వఖీల్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి భూ ఆక్రమదారులకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ధర్మారంలోని సర్వే నంబర్ 476తో పాటు ఖిలావనపర్తిలోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మానవహక్కులపై విద్యార్థులకు అవగాహన

ఇబ్రహీంపట్నం,మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మానవ హక్కులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల హెల్ప్ అసో సియేషన్ చైర్మన్ ఎండీ షలీం మాట్లాడుతూ రాజ్యాంగం మానవులు స్వేచ్ఛగా బతకడానికి ఎన్నో హక్కులను అందించిందన్నారు. ప్రతీ ఒక్కరు మనవ హక్కుల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పరాంకుశం నర్సయ్య, ఎండీ షాబీర్, హుస్సెన్, గంగాధర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఈ-ఆటో డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ ఆటో(ఈ-ఆటో) డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ హైదారాబాద్ ఆధ్వర్యంలో నడుస్తున్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదారాబాద్‌లోని మోవో సోషల్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈ-ఆటో డ్రైవింగ్ ఉచిత శిక్షణను మహిళా ఇన్‌స్ట్రక్టర్స్ ద్వారా ఇవ్వనున్నట్లు వివరించారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు 50 మంది నిరుపేద గ్రామీణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళాలకు 45 నుంచి 60 రోజుల పాటు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఇప్పించేందుకు, మహిళలు ఈ-ఆటో కొనుగోలు చేసేందుకు రుణాలు లభించే విధంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అసక్తిగల మహిళలు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎల్ఎండీలోని మహిళా ప్రాంగణ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 9347114396, 9849787823 నంబర్లకు సంప్రదించాలని సుదారాణి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం శివారులోని అటవీ ప్రాంతం నుండి జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కులరావుపేటకు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి పట్టుకున్నట్లు అటవీ శాఖ డిప్యూటీ రెంజ్ అధికారి రాఘవేంద్రరావు మంగళవారం తెలిపారు. అటవీ ప్రాంతంలో నుంచి విలువైన టేకు కలప తరలి వెళ్లుతుందన్న పక్కా సమాచారంతో అక్రమ టేకు కలప తరలిస్తున్న ట్రాక్టర్ను మోత్కులరావుపేట శివారు అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకుని, చందుర్తికి తరలించామన్నారు. అక్రమ కలపను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, అనిత, అటవీ శాఖ సిబ్బంది తిరుపతి, శంకర్‌లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్థి శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 25,869 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు. పేకాట ఆడే వ్యక్తుల పై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

పెద్దపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని, కూనారం రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం జిల్లాకు వచ్చిన సందర్భంగా సీపీఎం నాయకులు ఆయనకు చీకురాయి రోడ్డు వద్ద స్వాగతం పలికి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యలపై సర్వే చేస్తున్నామని, అనంతరం సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఒక బస్సు ప్రయాణం తప్ప మిగతావి అమలు జరగలేదన్నారు. గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, రాష్ట్ర నాయకులు బిక్షమయ్య, కోట రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యంరావు, జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, జి జ్యోతి, మండల కమిటీ సభ్యులు మోదంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, సీపెల్లి దిలీప్, నవీన్, వెంకటస్వామి, ఖాజా, రాజమల్లు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

సీఎం రేవంత్‌కు కేసీఆర్ గతే..

కోల్‌సిటీ: బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారంతో నిర్బంధ పాలన చేశాడని, అతన్ని ప్రజలు ఇంటికి పంపారని, అదే విధానాన్ని కొనసాగిస్తే రేవంత్‌కు అదే గతి పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ప్రసంగించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నారని, సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసాను పూర్తి చేయడం లేదన్నారు. ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సేవకులకు వేతనాలు పెంచడం లేదన్నారు. అనంతరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకురాలు మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, బిక్షమయ్య, జిల్లా కార్యదర్శి యాకయ్య, నాయకులు ముత్యంరావు, రామాచారి, వేల్పుల కుమారస్వామి, సారయ్య, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై రామగుండంకు వచ్చిన జాన్‌వెస్లీకి

ఈతకు వెళ్లి బాలుడి గల్లంతు



నరేష్(ఫైల్)

గొల్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాము నిపల్లెలో రిజర్వాయర్‌లోకి ఈతకు వెళ్లిన విద్యార్థి నరేష్ (12) చెరువు లో పడి మంగళవారం గల్లంతయ్యాడు. రంగదామునిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటి పూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రంగదామునిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరో చోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు.

ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడం తో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రిజర్వాయర్ వద్దకు వచ్చి స్థానిక జాలర్లతో బాలుడి కోసం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



విష్ణు (ఫైల్)

తంగళ్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మోగిలోజు విష్ణు(44) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం.. విష్ణు కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతుండగా కుమారుడికి రేచీకటి వ్యాధి, కూతురు మానసిక ఎదుగుదల లేకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పక్షవాతంతో పనిచేసే పరిస్థితి లేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కవిత, కూతు రు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై యువకుడి అత్యాచారం

సైదాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఓ గ్రామంలో 70 ఏళ్ల వృద్ధురాలిపై కరీంనగర్ పట్టణానికి చెందిన షేక్ ముక్తార్ (33) అనే యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ముక్తక్ ఖురేషి ఓ చికెన్ సెంటర్‌లో పనిచేసేందుకు తన కుటుంబంతో సహా కరీంనగర్ నుంచి ఎనిమిది నెలల క్రితం సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి వచ్చాడు. మూడు నెలలు చికెన్ సెంటర్‌లో పనిచేసిన తర్వాత అతని ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో యజమాని పనిలో నుంచి తొలగించాడు. అప్పటి నుంచి షేక్ ముక్తార్ అదే గ్రామంలో సొంతంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కొన్నిరోజుల క్రితం తన స్వస్థలమైన కరీంనగర్‌కు కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 10గంటల ప్రాంతంలో గ్రామానికి వచ్చి వృద్ధురాలిపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి కరీంనగర్‌కు వెళ్లిపోయాడు. బాధితురాలు సోమవారం తనపై షేక్ ముక్తార్ అత్యాచారం చేశారని సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయుడికి బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్ట్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు

గంభీరావుపేట మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజసింగవరం ప్రభుత్వ పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు అక్కపెల్లి యాదగిరిగౌడ్ బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్టుగా అవార్డు అందుకున్నాడు. ఉగాది పండగ పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డును ప్రముఖ సినిమానటులు ఆర్ఎస్ నంద, సీతామాలక్ష్మి చేతుల మీదుగా ఉపాధ్యాయుడు యాదగిరిగౌడ్ అందుకున్నాడు. ఈ సందర్భంగా కళాకారులు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు యాదగిరి గౌడ్‌ను అభినందించారు.

రూ.7,240 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,240 రూపాయలు పలికింది. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 165 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర 7,240 రూపాయలు, కనిష్ఠ ధర .5700 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాలనీలోని హనుమాన్‌నగర్‌లో నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నాటుసారా విక్రయాలు జరుపుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు లావుడ్య రాజేశ్వరి ఇంటిలో సోదాలు నిర్వహించగా, 5 లీటర్ల నాటుసారా పట్టుబడినట్టు ఎస్సై తెలిపారు. నాటుసారా స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

'గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిన పండ్లు, కూరగాయలు'

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిన పండ్లు కూరగాయలు ఇస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం నగరంలోని రాంనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో కుళ్లిన పండ్లను సరఫరా చేస్తూ, నాణ్యతలేని కూరగాయలను పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో నరేష్‌పటేల్, ప్రకాశ్, రాము, లక్పతి నవీన్, రాము నరేష్, రాజేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



కుళ్లిన పండ్లను చూపిస్తున్న నాయకులు

పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య



రాజు(ఫైల్)

తంగళ్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు అప్పులు, మరో వైపు ఉపాధి లేక పవర్ లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇందిరమ్మకాలనీ గ్రామానికి చెందిన పవర్‌లూం కార్మికుడు పరికిపెల్లి రాజు(65) సోమవారం రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మంగళవారం మృతిచెందాడు. రాజుకు భార్య పద్మ, కొడుకు రాకేశ్, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. రాజు మరమగ్గాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల, కొడుకుకు వివాహం జరిపించగా సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పులు అయ్యాయి. కొద్ది రోజులుగా పనిలేక ఇబ్బందులు పడుతూ మద్యానికి బానిసయ్యాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై బాత్‌రూం క్లీన్ చేసే యాసిడ్ తాగాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **కుటుంబాన్ని ఆదుకోవాలి..**

ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న రాజు కుటుంబానికి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. రాజు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కార్మికుల ఆత్మహత్యలు నివారించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు నెలకు 26వేల రూపాయల వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన 2023 యారన్ సబ్సిడీ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

జగిత్యాలరూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎస్‌కెఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు జ్ఞానసముపార్జనే కాకుండా, వినియోగ విశ్లేషణ కార్యక్రమాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఇకముందుకూడా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాసవి, వరప్రసాద్, సంగీతరాణి, సుజాత, శ్రీలత,, నీరజ, జమున, సుస్మిత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్రం అవార్డులు



ప్రగతి చక్రం అవార్డులను అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

భగత్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మంగళవారం అధికారులు ప్రగతిచక్రం అవార్డులు ప్రదానం చేశారు. అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎం బి రాజు అవార్డులు అందించారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలకు చెందిన 56 మంది ఉద్యోగలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి వెంకటేశ్వర్‌రావు, ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటీ ఆర్ఎం

కరీంనగర్ రీజియన్ రీజినల్ మేనేజర్ బి రాజును బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ రీజినల్ మేనేజర్ బి వెంకటేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

శాతవాహన పరిధిలో లా, ఇంజనీరింగ్ కళాశాలలు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కరీంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా, ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 18,19లను సోమవారం రాత్రి విడుదల చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హస్నాబాద్‌లో ఇంజినీరింగ్, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్‌లో లా కళాశాల ఏర్పాటు కు పచ్చ జెండా ఊపింది. ఈ రెండు కళాశాలలు రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి. హస్నాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచ్‌లు ప్రారంభించనున్నారు. ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.44.12 కోట్లు కేటాయించగా అందులో రూ.29.12 కోట్లు ప్రస్తుతం మంజూరు చేశారు. మిగతా రూ.15 కోట్లను తర్వాత మంజూరు చేయనున్నారు. శాతావాహన వర్సిటీలో ఏర్పాటు చేయనున్న లా మూడేళ్ల కోర్సు, రెండేళ్ల కోర్సులో అడ్మిషన్లు ఇవ్వబోతున్నారు. ఈ కళాశాల నిర్మాణానికి మొత్తం రూ.22.96 కోట్లు కేటాయించారు. అందులో ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ.67.08 కోట్లను ప్రభుత్వం రెండు కళాశాలలకు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై శాతవాహన వీసీ ఉమేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఎమ్మెల్యేలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రాములోరి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించాలి

అధికారుల సమావేశంలో ఆర్డీవో రాజేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్‌రావు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించాలని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆర్డీవో రాజేశ్వరావు సూచించారు. వేములవాడ రాజన్న ఆలయంలోని గెస్ట్‌హౌస్ సమావేశం మందిరంలో అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మార్చి 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని, కల్యాణానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయ ఈవో వినోద్ రెడ్డి మాట్లాడుతూ రామనవమికి వచ్చే భక్తులకు మంచినీటి సరఫరా, క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్లు, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు నిర్వహిస్తున్నమని తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ వారికి సూచించారు. మజ్జిగా ప్యాకెట్లు, అరటి పండ్లు, అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ వీరప్రసాద్, డీఈ రఘునందన్, ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్ అధికారులు పాల్గొన్నారు.

'సూరమ్మ' కాలువల పనులు కొనసాగేనా?



సూరమ్మ చెరువు

- పరిహారం పెంచాలని రైతుల డిమాండ్
- పరిహారం కింద రూ.10 కోట్లు విడుదల
- మరో రూ.70 కోట్లకు ప్రతిపాదనలు
- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు

కథలాపూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులకు ఈ ఏడాది కూడా గ్రహణం పట్టే పరిస్థితులే కనిపిస్తున్నాయి. వానా కాలం మరో రెండు మాసాల్లో ఆరంభం కానున్న నేపథ్యంలో పనులకు సమయం మించి పోతోంది. అధికార యంత్రాంగం హడావుడిగా నష్ట పరిహారం చెల్లింపు కోసం గ్రామ సభలు నిర్వహించగా పలు గ్రామాల రైతుల నుంచి కాలువల నిర్మాణంపై నిరాసక్తత వ్యక్తమైంది. తమకు కాలువలే వద్దని కొందరు ఖరాఖండిగా చెప్పగా, మరికొంత మంది పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పనుల కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి.



కుడి కాలువకు సర్వే చేసి వేసిన హద్దులు

520 ఎకరాల భూములకు నష్టపరిహారం

సూరమ్మ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 45 వేల ఎకరాల బీడు భూములకు సాగు నీరందించాలని అప్పటి బీఆర్ఎస్ సర్కారు కాలువల తవ్వకానికి రూ.204 కోట్లు కేటాయించింది. వెన్సా అనే కంపెనీ ఈ పనులను దక్కించుకుంది. ఆరేళ్ల కిందటే సదరు కంపెనీ ఇసుకను ఇప్పపల్లిలో నిల్వ చేసుకుని క్యాంపు ఏర్పాటు చేసుకుంది. అయితే భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తో నష్టపరిహారం కోసం రూ.10 కోట్లు విడుదల చేసి పబ్లిక్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అధికారులు గ్రామాల వారీగా భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సమావేశాల్లో కొన్ని గ్రామాల రైతులు తాము చిన్న, సన్నకారు రైతులమని సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని పేర్కొంటూ భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. మరి కొన్ని గ్రామాల్లో పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పనుల కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది. మరో రూ.70 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

ఎకరానికి ప్రస్తుతం ఉన్న భూమి విలువ ప్రకారం చెల్లించాలని నిర్ణయించగా రైతుల నుంచి వచ్చే డిమాండ్లపై ఎలా స్పందిస్తార నేది వేచిచూడాలి.

ఈ కాలువల వల్ల కథలాపూర్ మండలంలోని కలికోటలో 48.31 ఎకరాలు, పోతారంలో 24.17, తాండ్ర్యాలలో 42.22, అంబారిపేటలో 73.03, దుంపెట 28.02, చింత కుంటలో 24.33, గంభీర్‌పూర్‌లో 50.04, ఇప్పపల్లిలో 39.11, పోసాని పేటలో 20.17 ఎకరాల చొప్పున రైతులు భూముల కోల్పోతున్నారు. మేడిపల్లి మండలంలోని దమ్మన్న పేటలో 05.06, భీమారంలో 22.18, మన్నెగూడెంలో 37.14, గోవిం దారంలో 104 ఎకరాల చొప్పున భూములకు నష్టం జరుగుతోంది. ఈ భూములకు పరిహారం కింద రూ.80 కోట్లు అవసర మని అధికారులు అంచనా వేశారు.



పరిహారం పెంచాలి

యాగండ్ల రమేశ్‌గౌడ్, దుంపెట

గౌడ సంఘం ఆధ్వర్యంలో 14 ఎకరాల్లో ఉపాధి కోసం ఈత చెట్లను పెంచుకున్నాం. మొక్కలు తెచ్చి డ్రిప్ ఏర్పాటు చేసుకుని అధిక వ్యయం చేసి పెంచుకున్నాం. కాలువలో దాదాపు 11 ఎకరాల భూమి కోల్పోతున్నాం. ఈత చెట్లనే నమ్ముకుని బతుకున్నాం. గుంటకు రూ.70 వేలు పరిహారం చెల్లించాలని వినతిపత్రం అందజేశాం.

ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక కవులు ముందుకు తీసుకెళ్లాలి

- సాహిత్యానికి ఆధ్యాత్మిక, కార్మిక క్షేత్రాలు పుట్టినిల్లులాంటివి
- కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్
- ఆధునిక సమాజంతో నడవకుంటే ఆగిపోవాల్సి వస్తుంది
- డాక్టర్ దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథం
- ఉత్సాహంగా ప్రారంభమైన రెండు రోజుల సాహిత్య జాతీయ సదస్సు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వారసత్వాన్ని ఆధునిక కవులు ముందుకు తీసుకువెళ్లాలని, సాహిత్యానికి పుట్టినిళ్లుగా ఆధ్యాత్మిక, కార్మిక క్షేత్రాలైన వేములవాడ, సిరిసిల్లలు నిలుస్తున్నాయని కాళోజీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిరిసిల్ల మానేరు రచయితల సంఘం, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం సాహిత్య సమాలోచన రెండు రోజుల జాతీయ సదస్సును కవులు అందరు కలిసి జ్యోతిప్రజ్వళన చేసి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. సాయంత్రం డాక్టర్ నలివెల భాస్కర్-సావిత్రి, జూకంటి జగన్నాథం-రమాదేవి దంపతులకు ఘనం గా ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం దూడం గణేష్ కవిత సంపుటి 'మాయ మైన మనిషి'ని ఆవిష్కరించారు. సదస్సులో నలిమెల భాస్కర్ మాట్లాడుతూ ఆధ్యా త్మిక, కార్మిక క్షేత్రాలైన సిరిసిల్ల, వేములవాడ గడ్డపైన ఎంతో మంది గొప్ప కవులు, రచయితలు వెలుగొందారన్నారు. తమ స్వగ్రామమైన నారాయణపూర్ నుంచి తనకు సాహిత్యం అబ్బిందని, కవులకు తమ ఊరు అప్పట్లోనే పెట్టిందిపేరన్నారు. పుస్త కాలను చూస్తే ఎంత ఉత్తేజం వస్తుందో.. పిల్లలను చూస్తే అంతే ఉత్తేజం వస్తుందని సూచించారు. ఒకప్పుడు మనుషులను చూసి రాళ్లు ఏడ్చేవని.. ప్రస్తుతం రాళ్లను చూసి మనుషులు ఎడుస్తున్నారన్నారు. ఇక్కడ రాళ్లను తీసుకువెళ్లి చైనాలో పడేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి మాటలు మాట్లాడితే అర్బన్ నక్సలైట్ అంటారని, సంప్రదాయ మాటలు మాట్లాడితే సంప్రదాయపు కవిగా ముద్రవేస్తారని వివరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం కవులు, రచయితలు

జూకంటి జగన్నాథం మాట్లాడుతూ సంపద సృష్టించబడిన చోట ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. మారుతున్న గ్లోబలైజేషన్‌తో పాటుగా నేటి యువత ప్రతి దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ లోకానికి సూర్యచంద్రులు ఎలాగో మనకు నలిమెల, జూకంటి ఇద్దరు అలాంటి వరని కొనియాడారు. దక్షిణ ప్రాంత ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ మానేరు, మూలవాగు పరివాహ ప్రాంతాల్లో ఎంతో మంది కవులు వెలుగొందారని గుర్తు చేశారు. సదస్సు కన్వీనర్, తెలుగు శాఖ అధ్యక్షురాలు శారద మాట్లాడుతూ ప్రాచీన కళలకు పెట్టింది పేరు ఈ ప్రాంతం అన్నారు. కవి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ భాషకు, కవిత్వానికి ఇద్దరు బ్రాండ్ అంబాసిడర్‌లు అని కొనియాడారు. ఈ సదస్సు సంచాలకులుగా అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్, సదస్సు సహ సంచాలకుడిగా డాక్టర్ సిరిసిల్ల చందన, సదస్సు కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షుడు కటుకం శారద, మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీ.వీ. నారాయణ, విమర్శకులు ఎం. నారాయణ శర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, కవులు, రచయితలు హాజరయ్యారు.

వేములవాడకు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



నిరంజన్‌కు స్వాగతం పలుకుతున్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ. నిరంజన్, బీసీ కమి షన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమల గిరి సురేందర్‌లు మంగళవారం రాత్రి వేములవాడ ఆలయానికి చేరుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వీచ్చేసిన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. వారి వెంట ఆర్డీవో రాజేశ్వర్‌రావు, ఈవో వినోద్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఇల్లంతకుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని పయ్యావుల వైష్ణవి జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. వికారాబాద్‌లో జరిగిన 34వ రాష్ట్రస్థాయి పోటీలలో వైష్ణవి ఉత్త మ ప్రతిభ కనబర్చింది. ఈనెల 27నుంచి జాతీయస్థాయి పోటీలు బీహార్ రాష్ట్రంలో జరుగనున్నాయి. జాతీయస్థాయి పోటీల కు ఎంపిక కావడంపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మామిడి శ్రీనివాస్, సాన బాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గాదే స్వప్న, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

చొప్పదండి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలను సీబీఎస్ఈ మంగళవారం విడుదల చేసింది. గత జనవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి ఎనిమిది వేల మందికిపైగా విద్యార్థులు రాయగా, 80 మందిని ఎంపిక చేస్తూ జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందించనున్నట్లు చొప్పదండి నవోదయ ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. తొమ్మిదవ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. 14 మంది విద్యార్థులను ఎంపిక చేస్తూ జాబితాను ప్రకటించారు. వివరాలకు https:// cbseit.in/cbse/2025/nvs_result/Result.aspx వెబ్‌సైట్‌లోగాని విద్యాలయంలో గాని సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గుమ్లాపూర్ విద్యార్థిని ఎంపిక...

నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన పెరుమాండ్ల ప్రశస్తి ఎంపికయింది. ప్రశస్తిని సీఐ ప్రకాశ్, ఎస్ఐ సురేందర్ అభినందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు పదిహేను వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధి కారులు పర్య వేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి. కాగా రెండు రోజులుగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

బద్దిపోచమ్మకు బోనం మొక్కులు

ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలు పెట్టి ఒడి బియ్యం పోసి అమ్మవారిని దర్శించుకుని పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుంటూ కళ్లసాకతో మొక్కులు చెల్లించు కున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుం డా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చల్లని తాగునీరును భక్తులకు అందజేశారు. ఆలయ ఉద్యోగులు ఎప్పటికప్పుడు క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా చర్యలు తీసుకున్నారు.



రాజన్నను దర్శించుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పెద్దాపురం ఎమ్మెల్యే చిన్నరాజప్ప దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న ఆలయ రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. స్వామివారి నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, పీఆర్వో శ్రీకాంతచారీలు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఐడియా అదిరింది..



మత్తడి నుంచి పైపుల ద్వారా దిగువకు వస్తున్న నీరు



కొడిమ్యాల వాగులో నీటి ప్రవాహం

- మైసమ్మ చెరువు మత్తడి వద్ద చేరిన నీరు
- పైపుల సహాయంతో దిగువకు తరలిస్తున్న రైతులు
- పెరిగిన భూగర్భ జలాలు

కొడిమ్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. వాగులు, వంకలు ఎండిపోయాయి. యాసంగి పంటలకు సాగు నీరందడం కష్టంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కొడిమ్యాల మండల రైతులు ఓ ఆలోచన చేసి ఎటువంటి విద్యుత్ మోటార్ లేకుండా పైపుల ద్వారా దిగువకు నీటిని మరలించి విజయం సాధించారు.

సొంత డబ్బులతో..

కొడిమ్యాల మైసమ్మ చెరువులో నీరున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి నుంచి నీరు దిగువకు వెళ్లి వాగులో సమృద్ధిగా పారుతుండేది. ఎండలు పెరిగిపోవడంతో మత్తడి పైనుంచి నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో వాగులో జలాలు పూర్తిగా ఎండిపోయాయి. సాగునీటికి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రైతులందరూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మత్తడి సమీపంలో నీరున్నా దిగువకు రాకపోవడంతో ఒక ఆలోచన చేశారు. రైతులు డబ్బులు జమ చేసి 40 పైపులు కొన్నారు. వాటిని ఎగువన ఉన్న మత్తడి వద్ద ఉన్న నీటిలో ఉంచి దిగువకు మరలించారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో ఎటువంటి మోటర్ సహాయం లేకుండా గ్రావిటీ ద్వారా నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో వాగు జలకళను సంతరించుకుంది. ఈ నీటితో కొడిమ్యాల, పూడూర్ పెద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలలో నీరు చేరింది. సుమారు 500 ఎకరాలకు నీరందింది. మైసమ్మ చెరువు నుంచి వాగుకి ఇరువైపుల వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగింది. చెక్‌డ్యాంలకు నీరు చేరడంతో తాము ఎదుర్కొన్న సాగు నీటి కష్టాలు తొలగిపోయాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలోనూ పశువులకు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి పైపులు వేసుకోవటానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, నీటిపారుదలశాఖ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



నీటితో కళకళలాడుతున్న చెక్‌డ్యాం

సమయ పాలన సరే.. సేవలు అధ్వానం..





వీర్నపల్లిలో మందులు అందిస్తున్న ఫార్మాసిస్ట్, కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూలిన ప్రహరీ, ఎల్లారెడ్డిపేటలో మూలకు పడేసిన పడకలు

(5వ పేజీ తరువాయి)

వైద్య పరీక్షలు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారని, మెరుగైన వైద్యంతో పాటు మందులు కూడా అందిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు.

అద్దె భవనంలో ఆరోగ్య కేంద్రం..

వీర్నపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. మారుమూల గిరిజన మండలంలో ఆరోగ్యకేంద్రాన్ని హడావుడిగా ఏర్పాటు చేసినా ల్యాబ్ టెక్నిషియన్, స్టాఫ్‌నర్సులను కేటాయించలేదు. ఉన్న మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్, జూనియర్ అసిస్టెంట్‌లు డిప్యూటేషన్‌పై సేవలందిస్తున్నారు. ఆరోగ్య కేంద్రానికి పూర్తిస్థాయి అనుమతులు లేకపోవడంతో మందుల కొరత ఏర్పడుతోంది. మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అద్దెభవనంలో ఏర్పాటు చేయడంతో ఇరుకు గదులతో రోగులకు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో 12 గంటలు మాత్రమే సేవలందించడంతో రాత్రిపూట ప్రజలకు ప్రైవేటుఆసుపత్రులే దిక్కవుతున్నాయి.

వైద్యుల కొరత.. సమస్యల మోత..

ఎలారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు రాచర్ల బొప్పాపూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత వేధిస్తోంది. నిత్యం సీహెచ్‌సీలో 120 మంది, పీహెచ్‌పీలో 40 మంది వస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో 13 మంది వైద్య నిపుణులకు ఒకరు ఎండీ ఫిజిషియన్, పిల్లల వైద్యుడు, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు సిరిసిల్ల ఆసుపత్రి నుంచి డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయిలో వైద్య నిపుణులు లేకపోవడం వల్ల గర్భిణీలు, ప్రసవాలు, శస్త్ర చికిత్స సేవలు అందడం లేవు. సీహెచ్‌సీలో ఆరు పడకలతోనే వెల్లదీయాల్సి వస్తోంది. 32 పడకల ఆసుపత్రిగా పదోన్నతి పొందినా వసతి కరవైంది. రక్త,మూత్ర పరీక్షలు చేసే యంత్రం ఆరు నెలలుగా పని చేయకపోవడం వల్ల కేవలం కొన్ని పరీక్షలు మాత్రమే సీహెచ్‌సీలో నిర్వహిస్తున్నారు. రోగుల వద్ద నుంచి నమూనాలను సేకరించి టీహబ్‌కు పంపిస్తున్నారు. 32పడకలను వేసేందుకు రేకుల షెడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసినా పూర్తిస్థాయి వసతులు లేక పడకలను మూలకు పడేశారు. జనరేటర్ అందుబాటులో ఉన్నా వినియోగంలోకి రాక రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో విధులు నిర్వహించే ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నిషన్ సీహెచ్‌సీలో కొనసాగుతున్నారు. పీహెచ్‌సీని రాచర్లబొప్పాపూర్‌లోని పల్లె దవాఖానాలో కొనసాగిస్తున్నారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నిషన్ లేకపోవడం వల్ల పరీక్షల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేందుకు రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులను వైద్య సిబ్బంది ఇవ్వాల్సి వస్తోంది. కేంద్రానికి ప్రత్యేక ఆన్‌లైన్ లింక్ ఇవ్వకపోవడం వల్ల మందుల సరఫరా సమస్యగా మారింది.

రోగులకు రవాణా భారం...

ముస్తాబాద్ : మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.1.50 కోట్లతో నిర్మించి ఇటీవల ప్రారంభించారు. సోమవారం ఆసుపత్రికి వచ్చిన రోగులు రక్తపరీక్ష కోసం మరలివెళ్లారు. రక్తపరీక్ష గదికి తాళం వేశారు. సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి టెక్నిషియన్ వెళ్లాడని వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి పేర్కొన్నారు. ఆసుపత్రికి జనరేటర్ తెప్పించి ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వలేదు. డీటీఆర్ కోసం సెస్ అధికారులకు దరాఖాస్తు చేసినట్లు వైద్యులు తెలిపారు. రాత్రిపూట కరెంటు పోతే క్యాండిల్‌ను పెట్టుకోవాల్సి వస్తోంది. మండల కేంద్రం నుండి పోతుగల్ వైపు రావాణా సౌకర్యం తక్కువగా ఉండటంతో రోగులకు ప్రయాణభారం పెరుగుతోంది. ఇద్దరు స్టాఫ్ నర్సులు, కాంటింజెంట్ వర్కర్‌ల కొరత ఉంది.

ప్రహరి లేక ఇబ్బందులు

కోనరావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్నారు. పశువులు, కుక్కలు లోపలికి వస్తున్నాయి. వైద్యాధికారి వేణుమాధవ్‌తో పాటు వైద్యులు సురేష్ కుమార్, ఆయుర్వేద వైద్యురాలు భ్యాల కుమారి వైద్య సేవలు అందిస్తుండగా, 16 మంది ఏఎన్‌ఎంలు ఉండాల్సి ఉండగా, 12 మంది ఉండడం వల్ల వైద్య సేవలు అందించడంలో ఇబ్బందికరంగా మారింది.

రవాణాభారం..

వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హన్మాజిపేటలో ఉంది. పీహెచ్‌సీలో ప్రతీ రోజు డాక్టర్ దివ్యశ్రీ వైద్య సేవలు అందిస్తున్నారు. సరిపడా మం దులు అందుబాటులో ఉన్నాయి. రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. పీహెచ్‌సీలో సరిపడా సిబ్బంది ఉన్నారు. మండలంలో 17గ్రామాలుండగా పీహెచ్‌సీ హన్మాజిపేటలో మండలానికి ఒకవైపు ఉండగా, మిగతా గ్రామాల వారికి రవాణా ఇబ్బందిగా మారింది.

నెలలో రెండు ప్రసవాలు..

చందుర్తి : చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు 80మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో, పాటు నెలలో ఒకటి రెండు ప్రసవాలు జరుగుతున్నాయి. పీహెచ్‌సీలో మందుల కొరత లేదని పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ వేదాచారి పేర్కొన్నారు. పాముకాటుకు మందు అందుబాటులో లేవన్నారు. సోమవారం 80మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూడపల్లి, బండపల్లి, మల్యాల, సనుగుల, మరిగడ్డ గ్రామాల్లో ఉప ఆరోగ్య కేంద్రాలు నడుస్తున్నాయి.పీహెచ్‌సీలో పూర్తిస్థాయిసిబ్బంది ఉన్నారు.

ఆటోల కోసం ఎదురుచూపులు..

- రంజాని సాయవ్వ, ముస్తాబాద్



పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో మండల కేంద్రం నుంచి ఆసుపత్రికి ఆటోలో వచ్చాను. ఆటో కోసం చాలా సేపు ఎదురుచూశాను. రూ.50 పెట్టి ఆసుపత్రికి వచ్చాను. మండల కేంద్రంలో ఆసుపత్రి ఉంటే అందరికీ వైద్య సేవలు అందేవి.

రక్తపరీక్షలు చేసేందుకు సిబ్బంది లేరు..

- లకావత్ లలిత, వీర్నపల్లి తండా



నా భర్తకు చలి జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకొచ్చి డాక్టర్‌కి చూపించాను. కానీ రక్త పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నిషియన్ లేడు. సబ్ సెంటర్ డాక్టర్ రక్తం తీసుకొని పరీక్షలకు జిల్లా ఆసుపత్రికి పంపిస్తా అన్నారు. పేద ప్రజలకు ఇక్కడే అన్ని సేవలందించాలి. సరిపడా మందులు అందుబాటులో ఉంచి పూర్తిస్థాయిలో సిబ్బందిని కేటాయించాలి.

మిషన్లను అందుబాటులోకి తేవాలి..

- అశ్విణి, గర్భిణి, వేములవాడ



నేను మొదటి కాన్పు నుంచి వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందుతున్నాను. ఎంతో ఓపికతో మాధవి మేడం పరీక్షలు చేసి సరైన సూచనలు చేస్తుంది. అందుచేతనే నేను రెండవ కాన్పు కోసం కూడా ఇక్కడే చూపించుకుంటున్నాను. అప్పుడే పుట్టిన శిశువులను చూసుకునేందుకు సరైన మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలి.

స్కానింగ్ కోసం వచ్చాను..

- హర్ష, బండపెల్లి, చందుర్తి



చందుర్తి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకున్నాను. స్కానింగ్ రిపోర్టు కోసమని వేములవాడ ఏరియా ఆసుపత్రికి పంపించారు. సీటీ స్కాన్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తే పేదలకు ఖర్చు లేకుండా అవుతుంది. వెంటనే సిటీ స్కాన్‌ను అందబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలి.

సంక్షిప్త సమాచారం

● వేములవాడ రూరల్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ నిధులతో ఫాజుల్‌నగర్ గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం బీజేపీ నాయకులు ప్రజలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, కొండవేని బుచ్చయ్య, బోగోజు అరుణ్, చింతంకుమార్, కుమారస్వామి, భైరగోని నరేష్, పోగుల రాకేష్, ఏడుమ్యాకల మధుకర్, ఎగుర్ల రాజు, బొక్కెన వెంకటేశం, శ్రీనివాస్, సాయిలు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని అంబేద్కర్ మాల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడుగా ఎరగొక్కుల రమేష్, ఉపాధ్యక్షులుగా మద్దెల నవీన్‌కుమార్, వంకాయల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వంకాయల కనుకయ్య, కార్యదర్శులుగా వీరేందర్ కోశాధికారిగా ఎరగొక్కుల రమేష్ గౌరవ సలహాదారులుగా నరేష్, మహేష్, బక్కయ్య, సురేష్‌లను నియమించినట్లు సంఘం సభ్యులు తెలిపారు.

● ఎల్లారెడ్డిపేట : భారతీయ జనతా పార్టీ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రెడ్డబోయిన గోపికి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలోని సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గోపి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, సత్తయ్య, బాలనర్సు, దేవయ్య, నారాయణ, నాంపల్లి, లింగం, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రానికి చెందిన అంతెర్పుల గోపాల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, రాములు, కిషన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులు మంగళవారం అందజేశారు. రాంరెడ్డి, బాబు, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, బాల్‌రెడ్డి, రాజుకుమార్, బుచ్చాగౌడ్, గోపాల్, రఫీక్, తిరుపతి, నారాయణ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలను ఊరేగించి ఆలయం వరకు చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండలం గర్జనపల్లి తండాకు చెందిన 6వ తరగతి విద్యార్థిని శ్రీనిత పోటీపరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నవోదయకు ఎంపికైంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన విద్యార్థిని నవోదయకు ఎంపిక కావడంపై మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు తిరుపతి జాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయురాలు కావేరి, రజిత, దేవి, సుమలత, వినీత, తదితరులు అభినందించారు.

● ఇల్లంతకుంట : మండలంలోని అనంతారం గ్రామ సరస్వతి భజనమండలి సభ్యులకు గంగాధరక్షేత్ర వ్యవస్థాపకుడు మూగు నాగరాజు శర్మ మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. భజనమండలి సభ్యులు రాధాకృష్ణ భజనలు చేస్తు మంచి గుర్తింపు పొందారు. కార్యక్రమంలో భజనమండలి సభ్యులు వికృతి రవి, గరిగె లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని దాచారంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్శరాం, మాజీ ఎంపీటీసీ బర్ల తిరుపతి, నాయకులు నర్సింగం, శ్రీశైలంయాదవ్, నాగరాజు, చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలకేంద్రంలో వరద రాజయ్య, అనవేని సత్యం ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాలకు పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, బండి శ్రీకాంత్, షాదుల్‌పాష, ప్రతాపరెడ్డి, గుండెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలోని నారాయణపూర్‌లో ఇటీవల చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన కమటం ఉదయ్‌కుమార్ కుటుంబానికి గొల్లపల్లిలోని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీమోహన్ గౌడ్ మంగళవారం రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు.

● గంభీరావుపేట : మండలంలోని లింగన్నపేట బస్టాండ్ ఆవరణలో హరిహర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎస్సై శ్రీకాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో వేదపండితులు రాధాకృష్ణశర్మ, నేతలు లింగన్నగారి దయాకర్‌రావు, దుబాసిరాజు బాలమల్లు, చింతల కిష్టయ్య, పాపారావు, అంజయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి బాపూరావు, సభ్యులు శ్రీనివాస్, స్వామి, తిరుపతి, రవి, మోతిరం, రాజు, దేవేందర్, రమేష్, శంకర్, కైలాస్ గంజి స్వామి, దేవదాస్, నర్మల రాజు, రాజు తదితరులు ఉన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు శ్రీరాముల రాజేశం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా మంగళవారం బ్యాంక్ ఆవరణలో రాజేశం భార్యదేవేంద్ర(నామినీ)కు లక్ష రూపాయల చెక్కును జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీస్ డాక్టర్ పెంచలయ్య, బ్యాంక్ మేనేజర్ సమ్మెట శ్రీనివాస్ అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది చిగురు శ్రీకాంత్, జగ్గని శరత్‌కుమార్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో తైబజార్‌కు వేలం వేసినట్లు మేజర్ పంచాయతీ ఈవో రమేశ్ తెలిపారు. పంచాయతీ ఆవరణలో మంగళవారం తైబజార్‌కు వేలం వేయగా ఎనిదిమంది వేలం పాటలో పాల్గొన్నారు. ముస్తాబాద్‌కు చెందిన గుండెల్లి రాములు రూ 5.50 లక్షలకు తైబజార్‌ను వేలంలో దక్కించుకున్నారు. గతఏడాది రూ 3.30 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నారు.

● రుద్రంగి : మండల కేంద్రానికి చెందిన పడాల శ్యామ్ కొద్దిరోజుల క్రితం ఆటోబోల్తా పడిన ఘటనలో తీవ్రగాయాలపాలై మంచానికే పరిమితం అయ్యాడు. పద్మశాలి సంఘ సభ్యుడైన శ్యామ్‌కు వైద్య ఖర్చులకోసం సంఘం ఆధ్వర్యంలో రూ 61 వేల ఆర్థిక సాయం అందచేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసని ఓం ప్రకాష్, మంచె రమేష్, పడాల శంకరయ్య, పిల్లమారపు ప్రవీణ్, స్వర్గం పరంధాములు, పులి లక్ష్మీరాజం, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించాలి..

- జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు

సిరిసిల్ల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు దమ్ము ధైర్యం ఉంటే ఆ ఐపీఎస్ ఎవరో చెప్పాలి.. బీదర్‌లో కేసీఆర్ దొంగ నోట్లు ముద్రించినట్లు నిరూపణ చేయాలని జడ్పి మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌పై బండి సంజయ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బీదర్‌లో దొంగనోట్లు ముద్రించి ఎన్నికల సమయంలో కేసీఆర్ పంపిణీ చేశాడని బండి సంజయ్ అర్థరహిత ఆరోపణలు చేశాడని మండిపడ్డారు. ఎంపీగా బండి సంజయ్ సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ మున్సిపల్ పరిధిలో ఎక్కడా ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.ఇప్పటికైనా కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీలు గజభీంకార్ రాజన్న, చంద్రయ్యగౌడ్, కుంభాల మల్లారెడ్డి, ఒజ్జల అగ్గిరాములు, గుండు ప్రేమ్‌కుమార్, సబ్బని హరీష్, షేక్ సికిందర్, కాసర్ల పవన్, పురుషోత్తం, సాయికిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

పాదయాత్రలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అవేజ్

చందుర్తి మార్చి 25 (ఆంధ్ర జ్యోతి) : రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ తీరును ఖండిస్తూ చేపడుతున్న పాదయాత్రలు విజయవంతం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి ఆవేజ్, మండల కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్‌లు అన్నారు. మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ పెరిక కల్యాణ మండపంలో ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్,జై సంవిధాన్ సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి మండలంలోని గ్రామగ్రామాన చేపట్టే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. మహాత్మగాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలు రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చెలకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు చింతపండు రామస్వామి, నాగం కుమార్, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించే మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో వరికోతలపై హార్వెస్టర్‌ల యాజమానులతో తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించి పాటించాల్సిన నియమనిబంధనలపై సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు టోకెన్ విధానంలో ప్రణాళిక ప్రకారం పంట కోతలు జరిగేలా చూడాలన్నారు. రైతులంతా ఒకేసారి ధాన్యం తీసుకుని వచ్చి ఇబ్బందిపడకుండా జాగ్రత్తలు పడాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు ఎప్పుడు ధాన్యం తీసుకుని రావాలో షెడ్యూల్‌లను రూపొందించి రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. ధాన్యం క్లీనింగ్ చేయడం, అరబెట్టడం వంటి అంశాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్యాడీ క్లీనర్‌లు, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ రజిత, జిల్లా పౌరసరఫరాల అధికారి వసంత లక్ష్మి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, మార్కెటింగ్ డీఎం ప్రకాష్, డీసీవో రామకృష్ణ, వ్యవసాయ అధికారి రామారావు, తూనికలు కొలతల అధికారి రూపేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పోతరాజు గంగాధర్, చందుర్తి మర్రి నిశాంత్ కూతురు అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకల ఎలకలయ్య, నాయకులు ఈర్లపల్లి రాజు, చిలుక పెంటయ్య, ఏనుగుల శ్రీనివాస్, దప్పుల అశోక్, పోతరాజు నగేష్, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

వీర్నపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలంలోని ఐకేపీ వివోఏలు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతుండగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని వివోఏల సంఘం మండల అధ్యక్షురాలు జయశీల మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం వెళ్తున్న వివోఏల అరెస్టులను ఖండిస్తూ సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్ మద్దతు పలికారు. అరెస్ట్ అయిన వారిలో వివోఏలు స్వప్న, పద్మ, రాధ, మాధవి, విజయ, తదితరులు ఉన్నారు.

ఆశా కార్యకర్తల నిరసనలు..



ముస్తాబాద్‌లో ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



కోనరావుపేటలో..



చందుర్తిలో..

సిరిసిల్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశావర్కర్‌లు నిరసనలు తెలిపారు. ఈసందర్భంగా అశావర్కర్‌లు అనిత, రజితలు మాట్లాడుతూ ఆశావర్కర్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలంటూ చేపట్టిన కమిషనరేట్ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో జరిగిన తోపులాటలో చనిపోయిన ఆశావర్కర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లావణ్య,లక్ష్మీ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశా కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో ఆశా వర్కర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లు పద్మ, జమున, హేమలత తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో జిల్లా నాయకురాలు మంజుల ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ఆందోళన చేశారు. రాజీవ్‌కూడలిలో మానవహారాన్ని ఏర్పాటుచేశారు. ఆశాకార్యకర్తల యనియన్ జిల్లా నాయకురాలు మంజుల కరుణ, దేవిక, మాధవి, జమున, లక్ష్మీ, జ్యోతి, శైలజ, అనురాధ, పద్మ, రాధ, జ్యోతి పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల ఆశావర్కర్లు మంగళవారం నిరసన చేపట్టారు. ఆశా వర్కర్లకు నిరసనకు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, గర్జనపల్లి గ్రామంలో ఆశా వర్కర్ల నిరసనకు బిఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జల ప్రశాంత్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు రాణి, అనిత, నవత, స్వప్న, సుజాత, జీవంతి, సీమ, సావిత్రి, చంద్రకళ, లావణ్య, సువర్ణ, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం మండలశాఖ అధ్యక్షురాలు సొల్లు శాంత ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆశాకార్యకర్తలు కట్కూరి కస్తూరి, తడకపెల్లి అరుణ, విజయ, లక్ష్మి, పద్మ, సంతోష, మమత తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు మంగళవారం నిరసన తెలిపారు. ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకలవ్య సంఘం జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కోనేటి సాయన్న, ప్రధాన కార్యదర్శి మొగిలి ధర్మరాజు, ఉపాధ్యక్షులు మానుపాటి పరుశురాములు, అనుమల దేవయ్య, కార్యదర్శి సుల్తాన్ తిరుపతి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షరాలు కుర్రు సావిత్రి, కార్యవర్గ సభ్యులుగా కోలేటి రమేష్, సుల్తాన్, శేఖర్, మొగిలి రాజశేఖర్, బిజిలి కనకరాజు, వానపాటి తిరుపతి, మొగలి రవి, బండి యాదగిరిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయన్న మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

5వరకు నూతన సభ్యత్వ నమోదు

సిరిసిల్ల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం, పట్టణ మహిళ సంఘం, పట్టణ యువజన సంఘం నూతన సభ్యత్వ నమోదు ప్రక్రియను ఏప్రిల్ 5వరకు పొడిగిస్తున్నామని సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెంకటరమణ మాట్లాడారు. పద్మశాలి సంఘం నూతన సభ్యత్వ నమోదు బుధవారం వరకే ఉందని పద్మశాలీల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 5 వరకు సభ్యత్వ నమోదును పొడిగించామన్నారు.సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షుడు బాలయ్య, మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల సందర్శన

వీర్నపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమికపాఠశాల విద్యార్థులు ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉదయలక్ష్మి, ఏకలవ్యపాఠశాల ప్రిన్సిపాల్ రామ్ సూరత్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

గంభీరావుపేట మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజసింగవరం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అక్కపెల్లి యాదగిరిగౌడ్ బెస్ట్ మిమిక్రీ ఆర్టిస్టు అవార్డు అందుకున్నాడు. ఉగాది పండుగను పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హాస్యనటుడు ఆర్ఎస్ నంద, సీతామాలక్ష్మి చేతులమీదుగా ఉపాధ్యాయుడు యాదగిరిగౌడ్ అవార్డును అందుకున్నాడు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ అధికారులు ముస్లింలకు మంగళవారంరాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సత్తయ్య, ఎస్సై రమాకాంత్, ఎంఈవో కృష్ణ హరి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని జామా మసీద్‌లో ఇఫ్తార్ విందు ఇచ్చారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్ అలీ, ఎస్సై శ్రీకాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలకేంద్రంలోని మసీదులో ప్రభుత్వ ఇఫ్తార్ విందును అధికారులు మంగళవారం ఏర్పాటుచేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మల్లేశం, తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఎస్సై ఎల్లాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రఫీ, ఉస్మాన్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.